# హోరాహోరీ పోరులో కాంగ్రెస్ విజయం

- 1,152ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలుపొందిన లక్ష్మీకాంతరావు
- మొదటి 13 రౌండ్ల వరకు ముందజలో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ షిండే


రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్, డిసెంబర్ 3: జుక్కల్ నియోజకవర్గ కౌంటింగ్‌ను ఆదివారం కామారెడ్డిలో నిర్వహించారు. హోరాహోరీగా సాగిన కౌంటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంత రావు 1,152 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి హన్మంత్ షిండేపై విజయం సాధించారు. నియోజకవర్గంలో మొత్తం 19 రౌండ్ల్ ఉండగా.. మొదటి రౌంట్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండే మెజార్టీ సాధిస్తూ వచ్చారు. మొదటి నుంచి 13వ రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లో బీఆర్ఎస్ ఆధిక్యం ప్రదర్శిస్తూ 3,187 ఆధిక్యంతో సాధించింది. 13 రౌండ్ల వరకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆధిక్యంలో ఉండగా.. 14వ రౌండ్ నుంచి మెజార్టీ తగ్గుతూ 19వ రౌండ్ వరకు కాంగ్రెస్ పార్టీ మెజార్టీ క్రమంగా పెరిగింది. చివరకు 1,152 ఓట్ల మెజార్టీతో లక్ష్మీకాంతరావు విజయం సాధించారు. నియోజకవర్గంలోని మద్నూర్, డొంగ్లీ, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాల్లో 1,63,569 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి 64,489, బీఆర్ఎస్ అభ్యర్థికి 63,387 ఓట్లువచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఆరుణ తార 28,437 ఓట్లు సాధించగా.. స్వతంత్ర అభ్యర్థులతో పాటు మిగితా వారందరికీ కలిపి 7,256 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్ అనంతరం ఎన్నికల అధికారి లక్ష్మీకాంతరావుకు ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

***ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా..***

తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని లక్ష్మీకాంతరావు అన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవకుడిగా ఉంటూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు.

# ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ గెలుపు

**23,621ఓట్ల మెజార్టీతో విజయం**



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్నమదన్‌మోహన్ రావు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 3: ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె. మదన్‌మోహన్ రావు ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్య ర్థి జాజాల సురేందర్‌పై 23 వేల 621 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మదన్ మోహన్ రావుకు 86,275 ఓట్లు రాగా ప్రత్యర్థి జాజాల సురేందర్‌కు 62,655 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి 26,709 ఓట్లు సాధించారు. మొత్తం 20 రౌండ్లు ఉండగా.. ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించింది.

***రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు ఇలా..***

ఎల్లారెడ్డి నియోజకవర్గ ఓట్లను 20 రౌండ్లలో లెక్కించారు. కామారెడ్డిలోని కౌంటింగ్ కేంద్రంలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొదటి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్‌కు 4,063, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌కు 4,841 ఓట్లు రావడంతో.. కాంగ్రెస్ అభ్యర్థికి 778ఓట్ల ఆధిక్యత లభించింది. రెండో రౌండ్‌లో 1,269 ఓట్లు, మూడో రౌండ్‌తో కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ 1,886 ఓట్లకు పెరిగింది. నాల్గో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4,648, బీఆర్ఎస్‌కు 3,535 ఓట్లు వచ్చాయి. ఐదో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,166, కాంగ్రెస్‌కు 3,442, ఆరో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 2,969, కాంగ్రెస్‌కు 3,250 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ మెజార్టీ 3,556కు చేరింది. ఏడో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3,714, బీఆర్ఎస్‌కు 2,853 ఓట్లు వచ్చాయి. ఎనిమిదో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 2,667 ఓట్లు, కాంగ్రెస్‌కు 3,961 ఓట్లు పోలయ్యాయి. తొమ్మిదో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,160, కాంగ్రెస్‌కు 4,080, పదో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,295, కాంగ్రెస్‌కు 4,742, 11వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,271, కాంగ్రెస్‌కు 4,157 ఓట్లు పోలవగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మెజార్టీ 8,964కు చేరింది. 12వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,699, కాంగ్రెస్‌కు 5,885, 13వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 2,947, కాంగ్రెస్‌కు 4,733 ఓట్లు వచ్చాయి. 14వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,110, కాంగ్రెస్‌కు 5,007 ఓట్లు పోలయ్యాయి. 15వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 3,192, కాంగ్రెస్‌కు 6,332, 16వ రౌండ్ ముగిసే సరికి కాంగ్రెస్ పార్టీ మెజార్టీ 20,416కు చేరుకున్నది. 17వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 2,590, కాంగ్రెస్ పార్టీకి 3,459, 18వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 2,960, కాంగ్రెస్‌కు 4,445 ఓట్లు రాగా.. 19వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 866, కాంగ్రెస్‌కు 1,547 ఓట్లు పోలయ్యాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ 23,451కు చేరింది. చివరి 20వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 147 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 317 ఓట్లు రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి మెజార్జీ 23,621కు చేరుకున్నది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ 23,621 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

# ఎల్లారెడ్డి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


ఎల్లారెడ్డిలో పూజల్లో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు, భక్తులు


సదాశివనగర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 3: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలను చేశారు. అనంతరం అష్టోత్తర శతనామావళి సహితంగా స్వామివారికి పూజలు చేపట్టారు. అనంతరం పట్టణంతోపాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు మండల దీక్షను చేపట్టి గురుస్వామి చంద్రం ఆధ్వర్యంలో మాలలు ధరించారు. దీక్ష తీసుకున్న భక్తులు చేసిన శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ పూజారి జంగం నీలకంఠం అప్ప, మాలధారులు ఓర భీమయ్య, మురళి, ప్రభాకర్, బోండ్ల సాయిలు, అవుసుల సంతోష్‌కుమార్, తరుణ్, దేశబోయిన సాయిలు, ప్రశాంత్‌గౌడ్, గోవింద్, ఓర శ్రీనివాస్ గురుస్వామి, ఓర భీమయ్య గురుస్వామి పాల్గొన్నారు.

***సదాశివనగర్‌లో నిత్యాన్నదానం..***

సదాశివనగర్, డిసెంబర్ 3: సదాశివనగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం వద్ద అయ్యప్ప మాలధారులు, భక్తులకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకుడు, గురుస్వామి హోటల్ రాజు మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. దీంతోపాటు జనవరి 5వ తేదీ వరకు ప్రతి రోజూ అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆదివారం నిర్వహించిన అన్నదానంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

తాడ్వాయి, డిసెంబర్ 3: మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని నందివాడ, క్రిష్ణాజివాడి, సోమారం, బ్రాహ్మణపల్లి, తాడ్వాయి, బ్రహ్మాజివాడి, కరడ్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వాటి ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకున్నదని తెలిపారు. ధాన్యం నూర్పిళ్లు త్వరగా చేపట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు.

## వాహనాల తనిఖీ

తాడ్వాయి, డిసెంబర్ 3: వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని ఎస్సై ఆంజనేయులు వాహనదారులకు సూచించారు. మండలంలోని దేవాయిపల్లి స్టేజీ వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై వాహనదారులతో మాట్లాడారు. ఇటీవల మండలంలో వేర్వేరు ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి ఇద్దరు ప్రాణాలను కోల్పోయారని అన్నారు. ఎర్రాపహాడ్ గ్రామ శివారులో కారు, బైక్ ఢీకొనగా ఒకరు, మండల కేంద్రంలోని కాలేజీ వద్ద లారీ, బైక్ ఢీకొనడంతో మరొకరు మృతి చెందారని తెలిపారు. ఈ రెండు ప్రమాదాలు అతివేగం, అజాగ్రత్తగా నడపడంతోనే జరిగాయని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ.. వాహనాలను నడపాలని సూచించారు.

# ఉల్లి నారుకు భలే గిరాకీ


గాంధారి సంతలో నారు కొనుగోలు చేస్తున్న రైతులు

గాంధారి, డిసెంబర్ 3: రైతులు యాసంగిలో వాణిజ్య పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. చాలా మంది రైతులు బోరుబావుల వద్ద తక్కువ నీటి వనరులతో పంటలను సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉల్లి, వెల్లుల్లితో పాటు మిరప, టమాట, వంకాయ పంటలను సాగు చేయనున్నారు. గాంధారిలో ప్రతి ఆదివారం సంతను నిర్వహిస్తారు. సంతలో పలు పంటల నారు విక్రయించడానికి చాలా మంది రైతులు వచ్చారు. బిచ్కుంద, పిట్లం, బాన్సువాడ, నిజాంసాగర్ తదితర మండలాల నుంచి రైతులు టమాట, వంకాయ, మిరప పంటలకు సంబంధించిన నార్లను తీసుకురాగా.. అవసరం ఉన్న రైతులు కొనుగోలు చేశారు. ఉల్లినారు కట్టను నాణ్యత ప్రకారం రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయించారు. టమాట, మిరప, వంకాయ నారు కట్టకు రూ.50 వరకు ధర పలికింది.

# వైభవంగా కొనసాగుతున్న కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు, ఇన్‌సెట్‌లో బద్ది పోచమ్మ

రామారెడ్డి, డిసెంబర్ 3: మండలంలోని ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలిసిన కాలభైరవ స్వామి జన్మదిన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఉన్న బద్ది పోచమ్మకు భక్తులు బోనాలను సమర్పించారు. పూజారులు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆలయ పూజారులు రాచర్ల శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మతో పాటు నాగరాజు, భరత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.